సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



కొత్త జీతానికి కొర్రీలు

క్రమబద్ధీకరణ చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పేస్కేల్ ప్రకారం వేతనం చెల్లింపుల్లో సందిగ్ధం నెలకొంది.

- IIలో ▸



ప్రజల్లో పెరుగుతున్న భక్తి

ప్రజల్లో భక్తి భావం పెరుగుతోంది. వివిధ ఆలయాల నిర్మాణాలకు దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు.

- IVలో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /24.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం మేఘావృతమయ్యే అవకాశాలున్నాయి.

ఈడీ నోటీసుల కలకలం

ఎమ్మెల్సీ కవితకు మరోసారి ఈడీ నోటీసులు రావడంపై జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఆమెకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. అయితే బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని. ప్రతి రాష్ట్రంలో ఎన్నికల వేళ బీజేపీకి ఇది పరిపాటిగా మారిందని కవిత వ్యాఖ్యానించారు. ఇలాంటి నోటీసులకు భయపడేది లేదన్నారు. మరోవైపు కవిత లిక్కర్ కుంభకోణంతో తెలంగాణ తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతికి రాష్ట్రం రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్లిందన్నారు.

- ఎమ్మెల్సీ కవితకు మరోసారి జారీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- లిక్కర్ కుంభకోణం కేసులో..
- జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ
- శిక్షిస్తే సమాజానికి మేలు : ఎంపీ అర్వింద్




కక్ష సాధింపు నేపథ్యంలోనే: ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారిన తరువాత కేసీఆర్‌కు దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేని బీజేపీ తమ కుటుంబంపై కావాలనే కక్షసాధింపు చేస్తోంది. ఈడీ లాంటి సంస్థలను మోదీ ప్రభుత్వం ఆడిస్తూ ఇలాంటి నోటీసులు పంపిస్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఇచ్చిన నోటీసులకు స్పందించాల్సిన అవసరం లేదు. నెలలతరబడి ఈ కేసును సాగదీస్తూ ఇష్టం వచ్చినట్లు బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రతి రాష్ట్రంలో ఎన్నికల సమయంలో బెదిరింపులు చేయడం బీజేపీకి పరిపాటి అయిందన్నారు. సీరియల్‌లాగా సాగదీస్తున్నారు. రాజకీయ కక్షతో ఇచ్చిన నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు. ఈ అంశంపై పెద్దగా ఆలోచించడమూ లేదు..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఎమ్మెల్సీ కవితకు తాజాగా మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుంచి నోటీసులు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి కవితకు గత మార్చి 8న మొదటిసారి ఈడీ నుంచి నోటీసులు వచ్చాయి. తాజాగా మరోసారి నోటీసులు రావడం, ఎన్నికలకు కౌంట్‌డౌన్ నడుస్తుండడంతో జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో కవిత పట్ల ఈడీ ఏవిధంగా ముందుకు వెళుతుందనే అంశాన్ని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠగా మాట్లాడుకుంటున్నారు. రాజకీయంగా త్రిముఖ పోటీ నెలకొని ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది.

ఇలాంటి వ్యక్తులు అభివృద్ధికి ఆటంకం: ఎంపీ అర్వింద్



కల్వకుంట్ల కవిత లాంటివాళ్లు సమాజానికి చెదపురుగులు. ఇలాంటి వ్యక్తులు అభివృద్ధికి ప్రధాన అడ్డంకి. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి కారణంగా తెలంగాణ రెండు దశాబ్దాల మేర వెనక్కు వెళ్లింది. కవితలాంటి వాళ్ల విషయంలో ఎంత తొందరగా నేరారోపణ రుజువు చేస్తే అంత మంచిది. దోషిగా తేల్చాక తక్షణమే శిక్ష ఖరారు చేసి రాజకీయాల నుంచి బయటకు పంపాలి. దీంతో సమాజానికి మేలు కలుగుతుంది. కవిత చేసిన లిక్కర్ కుంభకోణంతో తెలంగాణ తలదించుకునే పరిస్థితి ఏర్పడింది. కవిత చేసిన చెడ్డ పనికి ఈడీ నుంచి నోటీసులు వస్తే మోదీ నోటీసులుగా ఆమె అభివర్ణించడం చూస్తుంటే కళ్లు నెత్తికెక్కినట్లు అర్థమవుతోంది. అహంకారపూరిత మాటలకు పరాకాష్ట.

న్యూస్‌రీల్

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు



నిజామాబాద్‌నాగారం : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 25 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనంకు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పారితోషికాలను రూ.18 వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారన్నారు. విస్తృత సేవలందిస్తున్న ఆశాలకు కేవలం రూ. 9,750 పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సీఐటీయూ నాయకులు రేణుక, సుకన్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై మూడు కుక్కల దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు



నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ నగరంలో వీధి కుక్కలు వీరంగం చేస్తున్నాయి. గురువారం నగరంలోని సాయినగర్-3లో కుక్కల దాడిలో చిన్న పిల్లాడికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా కుక్కలు వచ్చి దాడి చేయడంతో అక్కడున్న పెద్దవారు కూడా ఏం చేయలేకపోయారు. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుక్కల దాడితో నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. కుక్కలు కాలనీల్లో గుంపులుగా సంచరిస్తూ దాడి చేస్తున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్నా అధికారుల్లో చలనం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ దృష్టి సారించి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


మెరుగైన సేవలందించిన సర్పంచ్‌కు ప్రోత్సాహకం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్ ప్రోత్సాహక ప్రశంస పత్రం అందుకున్నారు. జాతీయ మహిళా కమిషన్, కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ,తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరానికి అర్గుల్ సర్పంచ్ పద్మ హాజరయ్యారు. ఇందులో గ్రామంలో మెరుగైన ప్రతిభ కనబరిచి విశిష్ట సేవలందించిన అర్గుల్ సర్పంచ్ పద్మ రాజేందర్‌కు ప్రోత్సాహక ప్రశంస పత్రాన్ని అందజేశారు.

బీజేపీ ఫస్ట్ లిస్ట్ ఫేక్..

- ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్ : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సెంట్రల్ ఆఫీస్ నుంచి మొదటి జాబితా అంటూ విడుదల చేసిన లిస్ట్ ఫేక్ అని ఎంపీ అర్వింద్ గురువారం ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్ చేశారు. బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఇలాంటి ప్రకటనేది చేయలేదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ సెంట్రల్ ఆఫీస్ నుంచి 11 మంది అసెంబ్లీ అభ్యర్థులతో ఫస్ట్ లిస్ట్ ప్రకటించినట్లు జాబితా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ఆ జాబితాలో ఆర్మూర్ నుంచి అర్వింద్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఉంది.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన సీపీ



ఖలీల్‌వాడి : జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును ఆయన ఛాంబర్‌లో గురువారం పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

ఆంధ్రనగర్ జీపీకి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ నాయుడు రామారావు

నందిపేట్(ఆర్మూర్) : నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డు వరించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ – 2023 లో ఉత్తమ పనితీరు కనబరిచిన గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం తదితర అంశాలను ప్రాతిపదికగా ఎంపిక ప్రక్రియను నిర్వహించింది. ఈ మేరకు ఆంధ్రనగర్ జీ.పీ అవార్డుకు ఎంపికై ంది. గురువారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయత్ రాజ్ సంచాలకులు హన్మంతు రావు, సెర్ప్ సీఈఓ గౌతమ్, ఎస్.బీ.ఎం డైరెక్టర్ సురేష్ బాబుల చేతుల మీదుగా ఆంధ్రనగర్ సర్పంచ్ నాయుడు రామారావు, పంచాయతీ కార్యదర్శి ఐనార్ల సందీప్‌లు అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి చందర్నాయక్, డీపీఓ జయసుధ, ఎంపీడీఓ నాగవర్ధన్, ఎంపిఓ కిరణ్ కుమార్, ఎస్బీఎం సమన్వయకర్త నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో నాబార్డ్ ప్రతినిధుల భేటీ

డొంకేశ్వర్(ఆర్మూర్): సెంట్రల్ నాబార్డు ప్రతినిధులు డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌లో ఈ–నామ్ అమలు తీరు, పంటల విక్రయాల ద్వారా వచ్చే లాభాలపై రైతులతో మాట్లాడారు. పంటలను విక్రయించే సమయంలో ఏమైనా ఇబ్బందులున్నాయా, ఆన్‌లైన్ పేమెంట్లు సక్రమంగా జరుతున్నాయా.. అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. టార్పాలిన్లు, పంటను ఎండబోసేందుకు ప్లాట్‌ఫాంలు కావాలని రైతులు కోరారు. ఇందులో నాబార్డు ప్రతినిధులు కేదార్ రానే, సిద్దేశ్ సుర్వే, ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ గ్రేడ్–2 సెక్రటరీ విజయ్ కిషోర్, శకర్ దాస్ ఉన్నారు.



రైతులతో సమావేశమైన సెంట్రల్ నాబార్డు ప్రతినిధులు

కులవృత్తులకు ప్రోత్సాహం

- రూ. వేయి కోట్లతో మత్స్యకారులకు సబ్సిడీపై యంత్రాలు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- నడిపల్లి, నిజామాబాద్‌లో చేపల మార్కెట్లకు శంకుస్థాపనలు
- న్యాల్‌కల్ మాసాని చెరువులో చేపపిల్లల విడుదల

డిచ్‌పల్లి/మోపాల్/డొంకేశ్వర్ : కులవృత్తులను ప్రోత్సహిస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి లో రూ.50 లక్షలతో, జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో రూ.2 కోట్లతో హోల్‌సేల్, రిటైల్ చేపల మార్కెట్ల నిర్మాణాలకు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తాలతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. న్యాల్‌కల్ మాసాని చెరువులో 2.74 లక్షల చేప పిల్లలను, 1.37లక్షల రొయ్య పిల్లలను వదిలారు. మత్స్యకారులకు గుర్తింపు కార్డులు, కొత్త సొసైటీలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ నీటి వనరులు ఉన్న ప్రతి చోటా వంద శాతం సబ్సిడీపై చేపలు, రొయ్యల పెంపకానికి చర్యలు తీసుకోవడం వల్ల మత్స్య సంపద గణనీయంగా వృద్ధి చెందిందన్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట జిల్లా, మండల స్థాయిలలో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు నేరుగా చేపలను విక్రయించుకోవచ్చన్నారు. పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చన్నారు. జిల్లాలో మరిన్ని చేపల మార్కెట్‌లు నిర్మించడానికి కృషి చేస్తామన్నారు.75 శాతం సబ్సిడీపై ఫోర్ వీలర్ వాహనాలు, మోపెడ్‌లు, లగేజీ ఆటో రిక్షాలు అందజేస్తున్నామన్నారు. నలుగురు సభ్యులు కలిసి దరఖాస్తు చేసుకుంటే 65 శాతం సబ్సిడీపై మల్టీపర్పస్ వాహనాలను అందజేస్తామని మంత్రి తెలిపారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి మత్స్య కార్మిక సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది మత్స్య కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 24 వేల పైచిలుకు చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల మధ్య ఉంటారని, మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మంత్రి అన్నారు.

ఆర్టీసీ బిల్లుకు ఆమోదం : బాజిరెడ్డి వెల్లడి

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఆర్టీసీ బిల్లును గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోదించారని తెలిపారు. 43 వేల మంది ఆర్టీసీ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా మారిపోయారని స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు అదనంగా కెటాయిస్తున్నారని, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్, ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ తదితర ప్రాంతాల్లోనూ ఫిష్ మార్కెట్లు మంజూరు చేయాలని కోరగా, మంత్రి తలసాని సానుకూలంగా స్పందించారు.

లక్ష మందికి సభ్యత్వం ఇచ్చాం..

రాష్ట్రంలో ఏడాదిలోనే వెయ్యి సొసైటీల ద్వారా లక్ష మందికి కొత్తగా సభ్యత్వం ఇచ్చామని మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం నాయక్ తెలిపారు.

దేశంలోనే రాష్ట్రంలో అత్యధికంగా 5,430 సొసైటీలు ఉన్నాయన్నారు. మార్కెటింగ్ సొసైటీల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోహెడలో రూ.47కోట్లతో అంతర్జాతీయ స్థాయి హోల్‌సేల్ మార్కెట్ అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కరీంనగర్, రంగారెడ్డి, నిజామాబాద్‌లో హోల్‌సేల్ మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో సుమారు 30 రిజర్వాయర్లలో కేజ్‌కల్చర్‌కు అవకాశముందని తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లో చేపలు, రొయ్యల పెంపకం జరుగుతోందన్నారు. గత సంవత్సరం 866 చెరువుల్లో చేప పిల్లల పెంపకం జరుగగా, ఈ ఏడాది 1,118 చెరువుల్లో 4.70 లక్షల చేప పిల్లలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, మత్స్య కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీటి మల్లయ్య, ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మత్స్యకార్మిక సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దేశంలోనే మొదటిస్థానం

మత్స్యసంపదలో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. జిల్లాలో 22 వేల మందికి మత్స్య సొసైటీలో సభ్యత్వం ఉందని, 4 వేల మంది ఆడబిడ్డలు సభ్యులుగా ఉన్నారన్నారు.

మధ్యలోనే వెళ్లిపోయిన ఎమ్మెల్సీ కవిత..

అర్సపల్లిలో చేపల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన పూర్తవగానే ఎమ్మెల్సీ కవిత కొబ్బరికాయ కొట్టి వాహనంలో వెళ్లిపోయారు. ఈడీ నోటీస్ వచ్చిన నేపథ్యంలో ఆమె హైదరాబాద్ వెళ్లినట్లు తెలుస్తోంది.



అర్సపల్లిలో చేపల హోల్‌సేల్ మార్కెట్‌కు శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే గణేష్ గుప్తా తదితరులు



న్యాల్‌కల్‌లో మాసాని చెరువులో చేపపిల్లలను వదులుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా తదితరులు

సమీకృత మార్కెట్లు : బిగాల

నగరంలో ఆధునిక సదుపాయాలతో సమీకృత మార్కెట్లు నిర్మిస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అప్పగించిన శాఖలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. మత్స్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్ సిన్హా మాట్లాడుతూ చేపలకు మార్కెటింగ్‌కు సౌకర్యాలు కల్పిస్తూ, హోల్‌సేల్, రిటైల్, మొబైల్ మార్కెట్లకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.



పాల్గొన్న మత్స్యకారులు

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జెడ్పీ చైర్మన్ విఠల్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు : సీపీ సత్యనారాయణ
- సుహృద్భావ వాతావరణంలో వేడుకలు : జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు
- గణేష్ ఉత్సవాలు, మిలాద్–ఉన్–నబీ వేడుకల నేపథ్యంలో శాంతికమిటీ సమావేశం

సుభాష్‌నగర్ : ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో వినాయక చతుర్థి, మిలాద్–ఉన్–నబీ పండుగలు జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు పండుగలు ఒకేసారి వస్తున్నందున భద్రతాపరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించాలని, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, తాగునీరు, బారికేడ్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థనాలయాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయిస్తామని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో సుమారు 4500 వరకు వినాయక విగ్రహాలు ప్రతిష్టించే అవకాశం ఉందన్నారు.

పరస్పర సహకారం ఉండాలి : జెడ్పీ చైర్మన్

పరస్పర సహకారంతో సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకుందామని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం మకరంద్, డిప్యూటీ మేయర్ ఇద్రీస్, డీసీపీ జయరాం, అదనపు డీసీపీ గిరిరాజు, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



హాజరైన శాంతికమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు

తెలంగాణ చేపలు ప్రపంచానికి ఎగుమతి

- ఎంపీ అర్వింద్ అబద్ధాలకోరు..
- పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : రాబోయే రోజుల్లో తెలంగాణ చేపలను ప్రపంచానికి ఎగుమతి చేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం న్యాల్‌కల్‌లోని మాసాని చెరువులో చేప, రొయ్య పిల్లల విడుదల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం మత్స్యకారుల కోసం అమల్జేస్తున్న పథకాల ద్వారా మత్స్య సంపద పెరిగిందన్నారు. జిల్లా ప్రజలు ఎంపీగా కవితను ఓడించి అర్వింద్‌ను గెలిపించుకున్నారని, ఏనాడైనా మీ సాదకబాధకాలు తెలుసుకునేందుకు వచ్చాడా అని అడిగారు. జిల్లాకు పసుపుబోర్డు తెచ్చాడా..., ఎంపీ అబద్ధాల కోరు అని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కళ్లు లేని కబోదులు తిరుగుతున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులనుద్దేశించి ఎద్దేవాచేశారు. కాంగ్రెసోళ్లు, బీజేపోళ్లు వస్తారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి మత్స్యసహకార సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, మత్స్యకారులకు తప్ప వేరే కులాల వారికి సభ్యత్వం ఇవ్వొద్దని జీవో ఇచ్చామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, మత్స్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్ సిన్హా, కమిషనర్ లచ్చిరాం నాయక్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మత్స్యకార్మిక ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య ఉన్నారు.

తడపాకల్ విద్యార్థినికి అక్షరయాన్ పురస్కారం


దేగల వైష్ణవి

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దేగల వైష్ణవికి అక్షరయాన్ పురస్కారం–2022 అందించారు. సాహిత్యపరంగా విశేష కృషి చేసిన వైష్ణవి అమ్మ సరళ వచన శతకం, చదువు సరళ వచన శతకం, చిన్నారి కథల పుస్తకాల్లో తన సాహిత్య ప్రతిభను కనబర్చడంతో అక్షరయాన్ సంస్థ వ్యవస్థాపకురాలు అయినంపూడి లక్ష్మి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 23న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో వైష్ణవికి పురస్కారాన్ని అందించనున్నారని తెలుగు పండిట్ ప్రవీణ్ శర్మ వెల్లడించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 23న తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు సంస్థ నిజామాబాద్ ఆర్సీవో అలివేలు గురువారం తెలిపారు. మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న ఆర్సీవో కార్యాలయంలో ఈ ప్రవేశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9908799462ను సంప్రదించాలన్నారు.

కొత్త జీతానికి కొర్రీలు

- జేపీఎస్‌లకు పే స్కేల్ వర్తింపజేయడంలో అధికారుల జాప్యం
- ఐడెంటిటీ కార్డు తయారు చేయించి వేతనం బిల్లుతో జతపరచాలని మెలిక


మోర్తాడ్‌లో రెగ్యులరైజ్ ఉత్తర్వులను మంత్రి చేతుల మీదుగా అందుకుంటున్న జేపీఎస్‌లు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): క్రమబద్ధీకరణ చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పే స్కేల్ ప్రకారం వేతనం చెల్లించే విషయంలో సందిగ్ధత నెలకొంది. ఉద్యోగుల ఐడెంటి కార్డును తయారు చేయించి వేతనం బిల్లుతో జతపరిస్తేనే కొత్త వేతనం చెల్లించడానికి అవకాశం ఉంటుందని కొర్రీలు పెట్టడంతో ఉద్యోగుల్లో అసహనం వ్యక్తమవుతోంది. నాలుగున్నర సంవత్సరాల కింద నియమించబడిన జేపీఎస్‌ల ప్రొబేషనరీ పీరియడ్ గడిచిన ఏప్రిల్‌తో ముగిసిపోయింది. వెంటనే రెగ్యులరైజ్ చేయాల్సి ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో జేపీఎస్‌లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. చివరకు ప్రభుత్వం కమిటీ వేసి నివేదిక ఆధారంగా రెగ్యులరైజ్ చేయడానికి ఆమోదం తెలిపింది. ఇటీవల కమిటీ నివేదికలు ఉన్నతాధికారులకు అందడంతో జిల్లాలో 261 మంది జేపీఎస్‌లు రెగ్యులరైజ్ చేయబడ్డారు. వారికి గతంలో ఫిక్స్‌డ్ పే కింద రూ.28,719 వేతనం చెల్లించారు. ఇప్పుడు పే స్కేల్ అమలు చేస్తే రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా జీపీఎఫ్, ఇతర కటింగ్‌లు పోను కొంత తక్కువనే వేతనం లభిస్తుంది. వేతనంలో తేడా ఉన్నా ఉద్యోగ భద్రతతో పాటు ఉద్యోగోన్నతులకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో వారు రెగ్యులరైజ్ కోసం పట్టుబట్టారు. క్రమబద్ధీకరణ ఉత్తర్వులను జేపీఎస్‌లు ఇటీవల మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నా వేతనం విషయంలో తమకు ఇంకా న్యాయం జరుగలేదని వారు పేర్కొంటున్నారు. ఐడెంటి కార్డు తయారు, వేతనం బిల్లుతో జతపర్చడం అనే అంశాన్ని తెరపైకి తీసుకురావడం కాలయాపన చేయడం కోసమేననే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జేపీఎస్‌లకు కొత్త వేతనాన్ని వెంటనే అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రీడల్లో గెలుపోటములు సహజం


జెండావిష్కరణ చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి


ఏర్గట్లలో లెర్నింగ్ లైసెన్స్ అందిస్తున్న మంత్రి

బాల్కొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిసాన్‌నగర్‌లో ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడలను గురువారం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. తాను చదివిన పాఠశాలకు మంత్రి హోదాలో రావడం ఆనందంగా ఉందన్నారు. నాడు క్రీడలపై గత ప్రభుత్వాలు ప్రోత్సహించేవి కాదని తెలంగాణ వచ్చాక క్రీడల అభివృద్ధికి అధిక నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురికి ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీలు లావణ్య, సామ పద్మ, సుకన్య, జెడ్పీటీసీలు దాసరి లావణ్య, బద్దం నర్సవ్వ, తలారి గంగాధర్, స్థానిక సర్పంచ్ మానేటి తులసీ, ఎంఈవో రాజేశ్వర్, క్రీడల కన్వీనర్ సాయన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజుకుమార్, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపొద్దు

మోర్తాడ్: యువత లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపొద్దని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఉచితంగా డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్‌లను అభ్యర్థులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజాపూర్ణానందం, ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ మధు, సర్పంచులు గుల్లె లావణ్య, పత్తిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, భానుప్రసాద్, కుండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరిని విజయవంతం చేయాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించే కాంగ్రెస్ విజయభేరిని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ అబ్జర్వర్ నాగరాజు ఆధ్వర్యంలో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో సమావేశమై జన సమీకరణకు కావాల్సిన వాహనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సభ విజయవంతానికి అర్బన్ నుంచి బాలరాజు, రూరల్ నుంచి మహమ్మద్ ఈసాని, బాల్కొండ నుంచి అన్నయ్య గౌడ్, ఆర్మూర్ నుంచి రాంభూపాల్, బోధన్ నుంచి శేఖర్‌గౌడ్‌ను కో–ఆర్డినేటర్లుగా నియమించినట్లు చెప్పారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తూ బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మోసపూరిత హామీలను ప్రజలకు వివరించి కాంగ్రెస్‌పార్టీ మ్యానిఫెస్టోకు వివరించాలన్నారు. 65 ఏళ్ల ప్రత్యేక తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీకి ప్రజలు స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు, రత్నాకర్, భక్త వత్సలం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, కాంగ్రెస్ విజయభేరి నిజామాబాద్ రూరల్ కోఆర్డినేటర్ ఈసా, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరికొండ గంగారెడ్డి, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావాలి

- కరీంనగర్ ఆర్టీసీ జోన్ ఈడీ వినోద్‌కుమార్


ఉత్తమ సిబ్బందిని సన్మానిస్తున్న వినోద్‌కుమార్

ఆర్మూర్‌టౌన్: జిల్లాలోని ప్రతి ఆర్టీసీ డిపో లాభాలతో ముందుకు సాగాలని కరీంనగర్ ఆర్టీసీ జోన్ ఈడీ వినోద్‌కుమార్ అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోను ఆయన గురువారం సందర్శించి మాట్లాడారు. డ్రైవర్లు సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని కోరారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఆర్మూర్ ఆర్టీసీ రూ.60లక్షలతో లాభాల బాట ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఉత్తమ కండక్టర్, డ్రైవర్లను సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎం జానారెడ్డి, డిప్యూటీ ఆర్ఎం సరస్వతీ, ఆర్మూర్ డిపో మేనేజర్ శ్రీనివాస్, జిల్లాలోని అన్ని డిపో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద రావడంతో వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు చేపట్టారు. ముందుగా 10 వేల క్యూసెక్కులు వదిలిన అధికారులు క్రమంగా 15 వేల క్యూసెక్కులకు పెంచారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 18968 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులనీరు పోతుంది. ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90టీఎంసీలు) కాగా అదే స్థాయి నీటి మట్టం ఉంది.

అలీసాగర్‌లో..

ఎడపల్లి (బోధన్): మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్‌కు భారీ వరద రావడంతో ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు గురువారం తెలిపారు. నిజాంసాగర్ ప్రధాన కెనాల్ నుంచి భారీ వరద రావడంతో ప్రాజెక్టులోని ఒక గేటు ద్వారా 350 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు అధికారులు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


స్వామి(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయికి చెందిన అజ్జపల్లి స్వామి(31) పనినిమిత్తం కామారెడ్డికి బైక్‌పై వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఆకుల ఈశ్వర్ బైక్‌పై కామారెడ్డికి వస్తుండగా ఢీకొన్నారు. ఈ ఘటనలో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వర్‌ను స్థానికులు కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మహిళా సంఘం డబ్బులు స్వాహా


నిరసన తెలుపుతున్న మహిళా సంఘం సభ్యులు

రెంజల్(బోధన్): ఐకేపీ సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో రెంజల్ మండల కేంద్రానికి చెందిన వరలక్ష్మి మహిళా సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంఘం తీర్మాణ ప్రతి లేకుండా సిబ్బంది తమకు రావాల్సిన డబ్బులను స్వాహా చేసినట్లు తెలిపారు. నేరుగా వారి ఖాతాల్లో జమ చేసుకున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021 నుంచి ఇప్పటి వరకు మూడు విడుతలుగా రూ. 40వేలు, రూ. 50 వేలు, రూ. 3 వేలను వీవో వనిత, సీఏ నవ్య, సీసీ శ్యామల డబ్బులు వాడుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం సమావేశమైన సభ్యులు గ్రామంలోని ఐకేపీ కార్యాలయానికి చేరుకుని వివరాలు చూపాలని ప్రశ్నిస్తే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మహిళా సంఘం సభ్యులు పుష్ప, భూలక్ష్మి, సులోచన, రూప, లక్ష్మి, రేఖ, కమల, ఇందిర, కావేరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఒకరి మృతి



లింగేశ్వర్ (ఫైల్)

మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన లింగేశ్వర్ (37) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. లింగేశ్వర్ వ్యవసాయ పరికరాలను రిపేర్‌చేస్తూ జీవిస్తున్నాడు. స్నేహితులతో కలిసి ముచ్చటిస్తున సమయంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. లింగేశ్వర్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్సపొందుతూ యువకుడు..

ఎల్లారెడ్డి: మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన యువకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ (30)చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఈ నెల 4న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్నిలో మరొకరు..


వినోద్ మృతదేహం

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల వినోద్ మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరద కాలువలో మృతదేహం


మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన షేక్‌రియాజ్(30) రెండు రోజుల క్రితం వరద కాలువలో దూకి అదృశ్యం కాగా గురువారం మృతదేహం లభ్యమైనట్లు ప్రొబెషనరీ ఎస్సై శివాజీ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో..


హబీద్ అలీ(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డికి చెందిన ఓ యువకుడు అదృశ్యం కాగా గురువారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామంలోని మహ్మద్ హబీద్ అలీ(35) ఈ నెల 4న ద్విచక్ర వాహనంపై కామారెడ్డికి వెళ్తున్నట్లు చెప్పి రాలేదు. గురువారం అదే గ్రామానికి చెందిన రాంశెట్టి శేఖర్ తోట పక్కన ఉన్న చెరువు వాగు చెక్‌డ్యామ్‌పై గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని హబీద్‌గా పోలీసులు గుర్తించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో బాలుడి అదృశ్యం


జీవన్

వర్ని: మండలంలోని కోటయ్య క్యాంపులో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి జీవన్ గురువారం అదృశ్యమయ్యాడు. ఉదయం టిఫిన్ చేసే సమయంలో గమనించిన పీఈటీ హెచ్ఎం రాధకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్ఎం, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు అదృశ్యమైనట్లు బాలుడి తండ్రి ఆరోపించారు.

పాంగ్రాలో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని పాంగ్రాకు చెందిన బానోత్ నవ్యశ్రీ అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన నవ్యశ్రీ తిరిగి రాలేదన్నారు. భర్త నెహ్రూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన చిన్న నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము గురువారం తెలిపారు. రామర్తి రేవతికి చెందిన ఇంటి స్థలాన్ని చిన్న నర్సయ్య తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని నిర్మాణ పనులు చేపడుతున్నాడు. బాధితురాలు తహసీల్దార్, జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. దీంతో కోపంతో చిన్న నర్సయ్య రేవతిపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి గురువారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేయడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ. 5వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

రెండు బైకులు చోరీ

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు రెండు బైకులను దొంగిలించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్, ప్రశాంత్ తమ ఇంటి ఎదుట రాత్రి బైకులను నిలిపి నిద్రపోయారు. ఉదయం చూసే సరికి బైకులు కనిపించక పోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

వర్ని: మండల కేంద్రంలో ఓ యువకుడు కుటుంబ కలహాలతో సెల్‌టవర్ ఎక్కినట్లు పోలీసులు గురువారం తెలిపారు. మండలంలోని వడ్డేపల్లికి చెందిన శివకుమార్ కొంతకాలంగా భార్యతో గొడవలు జరగడంతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బుధవారం ఇంటికి వచ్చిన పరిస్థితి మారకపోవడంతో జీవితంపై విరక్తితో సెల్ టవర్ ఎక్కినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో చర్చించి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో యువకుడి కిందికి దిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తాం


మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

బోధన్‌టౌన్(బోధన్): పండుగల నేపథ్యంలో నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తామని సీపీ సత్యనారాయణ అన్నారు. బోధన్‌కు పీఎస్‌ను సీపీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా పీఎస్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. బోధన్‌లో ట్రాఫిక్ వ్యవస్థను నివారించడానికి ఉన్నత అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పట్టణ కేంద్రానికి చెందిన మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ ఘటనను త్వరగా చేదించి నిందితులను పట్టుకుంటామని సీపీ తెలిపారు. చోరీ జరిగిన హనుమాన్ టేకిడి ప్రాంతాన్ని పరిశీలించారు. సీపీ వెంట డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ రాజు, సిబ్బంది ఉన్నారు.

గణేశ్ ప్రతిమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి


సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: వినాయకచవితి సందర్భంగా జిల్లాలోని అన్ని వినాయక మండపాల నిర్వాహకులు ప్రతిమల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీపీ సత్యనారాయణ గురువారం పేర్కొన్నారు. 18న వినాయకచవితిని పురస్కరించుకుని మండపాల నిర్వాహకులు దిగువ చూపిన లింకు ద్వారా http://poiceportal.tspolice.gov.in పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యుత్ కనెక్షన్‌కు సంబంధిత శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద పోలీస్‌శాఖ సూచించిన సమయం ప్రకారమే సౌండ్‌బాక్సులు పెట్టాలని ప్రజలకు ఇబ్బందికరంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.